
# ‘స్పిరిట్’కి రంగం సిద్ధమైంది


ప్రభాస్

ఇప్పుడు ప్రపంచమంతా ‘సలార్’ ఫివర్‌తో ఉంది. టికెట్లకోసం అభిమానులు పడుతున్న అవస్తలు మామూలుగా లేవు. ఆన్‌లైన్ బుకింగ్ వచ్చాక కూడా టికెట్లు దొరకడం కష్టమైపోయింది. ఆ రోజుల్లో సీనియర్ ఎన్టీయార్, చిరంజీవి సినిమాలు విడుదలైనప్పుడు ఫ్యాన్స్ ఎలాగైతే కిలోమీటర్ల మేర బారులు తీరేవారో.. అలా థియేటర్ల ముందు జనం బారులు తీరడం ‘సలార్’ విషయంలోనే జరుగుతుందంటే అతిశయోక్తికాదు. ప్రభాస్, ప్రశాంత్‌నీల్ క్రేజ్‌కి ఇదొక నిదర్శనం. ఇదిలావుంటే.. ఇప్పుడు ప్రభాస్ ఫ్యాన్స్‌కి టి సిరీస్ సంస్థ ఓ శుభవార్త చెప్పింది. సంచలన దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటించనున్న ‘స్పిరిట్’ సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ని వారు విడుదల చేశారు. ‘యానిమల్’ మాదిరిగానే.. సందీప్‌రెడ్డి వంగాతో కలిసి టి.సిరీస్ అధినేత భూషణ్‌కుమార్ ‘స్పిరిట్’ సినిమాను నిర్మించనున్నారు. ‘యానిమల్ పార్క్’కు ముందే ఈ ప్రాజెక్ట్ ఉంటుందని వారు తెలిపారు. ఆ తర్వాత ‘యానిమల్ పార్క్’, దాని తర్వాత అల్లు అర్జున్ మూవీ చేయనున్నట్టు వారు ప్రకటించారు. ‘స్పిరిట్’ ఓ కాప్ స్టోరీ అని, అందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా కొత్తగా కనిపిస్తారని సందీప్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు కూడా. అంటే త్వరలోనే సందీప్‌రెడ్డి వంగా హీరోగా రెబల్‌స్టార్ ప్రభాస్ దర్శనమివ్వనున్నాడన్న మాట.



సంయుక్త మీనన్

# ఇదంతా నా అదృష్టం..

తెలుగులో వందశాతం సక్సెస్ రేట్ ఉన్న కథానాయిక సంయుక్త మీనన్. ఇక్కడ ఆమె చేసిన బీమ్లానాయక్, బింబిసార, సర్, విరూపాక్ష అన్నీ విజయాలే. త్వరలో ‘డెవిల్’ రాబోతున్నది. ఈ సినిమా కూడా సెంటిమెంట్‌ని కొనసాగించడం ఖాయమని చిత్రయూనిట్ నమ్మకం వ్యక్తం చేస్తున్నది. ఇదిలావుంటే తన పాత్రల గురించి, సక్సెస్‌ల గురించి సంయుక్త ఇటీవల మాట్లాడింది. ‘ పద్నాలుగు సినిమాలు మలయాళంలో చేశాను. తెలుగు, తమిళ భాషల్లో చెరో నాలుగు చేశాను. నా కెరీర్‌లో గొప్ప విజయాలన్నీ తెలుగులోనే వచ్చాయి. అందుకే తెలుగు నాకు లక్కీయస్ట్ ఇండస్ట్రీ. పైగా చేసిన నాలుగు సినిమాల్లోనూ విభిన్న పాత్రలే. ‘భీమ్లానాయక్’లో సాధారణ గృహిణిగా నటించాను. ‘బింబిసార’లో యువరాణిగా ఫోక్‌లర్ కేరక్టర్ చేశాను. ‘సర్’లో సామాజికదృక్పథం కలిగిన ఉపాధ్యాయురాలిని. ‘విరూపాక్ష’లో మీకు తెలిసిందే.. అన్నీ పొంతన లేని పాత్రలే. రానున్న ‘డెవిల్’ పీరియాడికల్ ఫిల్మ్. అందులో పాత్ర గురించి ఇప్పుడే రివీల్ చేయదలచుకోలేదు. భిన్నమైన పాత్ర అని మాత్రం చెప్పగలను. తెలుగులో చేసిన సినిమాలన్నీ హిట్స్ అవ్వడం. అన్నీ పొంతన లేని పాత్రలవ్వడం నా అదృష్టం’ అంటూ చెప్పుకొచ్చింది సంయుక్త.

# తండేల్ పోరాటం షురూ..

బతుకుతెరువు కోసం సముద్రంపైకెళ్లి శత్రుదేశానికి బందీగా మారిన ఓ భర్త చేసే పోరాటం. పెనిమిటిని దక్కించుకోటానికి నిండుచూలాలైన ఓ భార్య మాతృదేశంలో పడే ఆరాటం.. వెరసి ‘తండేల్’. ఆర్ద్రతతో నిండిన కథ, కథనాలతో సాగే ఈ పరిపూర్ణప్రేమకథకు నాయకా, నాయికలు నాగచైతన్య, సాయిపల్లవి. ప్రారంభం నుంచి అంచనాలు అంబరాన్ని తాకిన ఈ సినిమాను ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. చందు మొండేటి దర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ బుధవారం ఉడిపిలో మొదలైంది. పాత్రధారులంతా పాల్గొనే ఈ కీలక షెడ్యూల్‌లో కొంత టాకీతోపాటు యాక్షన్ పార్ట్ కూడా చిత్రీకరించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ కర్ణాటకలోని మాల్పే పోర్ట్(ఉడిపి)లో జరుగుతున్నది. నాగచైతన్య, ఫైటర్స్‌పై యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. నాగచైతన్య ఇందులో మత్స్యకారుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇది అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న యదార్థగాథని దర్శక, నిర్మాతలు చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సమర్పణ: అల్లు అరవింద్.



నాగచైతన్య


రవితేజ

# విభిన్న కోణాల ఈగల్

‘ఆయుధంతో విధ్వంసం చేసేవాడు రాక్షసుడు.. ఆయుధంతో విధ్వంసం ఆపేవాడు దేవుడు.. ఈ దేవుడు మంచోడు కాదు.. మొండోడు..’ ‘ఈగల్’ ట్రైలర్ చివర్లో రవితేజ చెప్పే డైలాగ్ ఇది. హీరో కేరక్టరైజేషన్‌కీ, కథకూ దర్పణంలా ఈ డైలాగ్ ఉంది. ట్రైలర్‌తో చూచాయగా కథ చెప్పేశాడు దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని. జనవరి 13న సంక్రాంతి కానుకగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేశారు. ట్రైలర్‌ని బట్టి చూస్తే రవితేజ పాత్రలో విభిన్న కోణాలు కనిపిస్తున్నాయి. ఆయన రెండు గెటప్పుల్లో కనిపిస్తున్నారు. ఆద్యంతం యాక్షన్ డ్రామాగా హాలీవుడ్ స్థాయి మేకింగ్ ట్రైలర్‌లో దర్శనమిస్తున్నది. మాస్ ప్రేక్షకులే లక్ష్యంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రవితేజ కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుందని చిత్రబృందం నమ్మకంగా చెబుతున్నది. అనుపమ పరమేశ్వరన్, కావ్య థాపర్ ఇందులో హీరోయిన్లు కాగా, మధుబాల, నవదీప్, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి మాటలు: మణిబాబు కరణం, సంగీతం: దావ్‌జాంద్.

# మాజీ ప్రేమికుల యాక్షన్ డ్రామా


శ్రుతిహాసన్

ఇద్దరు మాజీ ప్రేమికుల నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా ‘డెకాయిట్’. అడివి శేషు, శ్రుతిహాసన్ ప్రధాన పాత్రధారులు. షానీల్ డియో దర్శకుడు. ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో రూపొందుతోన్న ఈ పాన్ ఇండియా యాక్షన్ డ్రామాకు సంబంధించిన టైటిల్ టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ ద్వారా మేకర్స్ ఓ కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించారు. ప్రేక్షకులు బిగ్ స్క్రీన్‌పై ఎన్నడూ చూడని సరికొత్త ప్రపంచాన్ని ఈ సినిమాలో చూస్తారని అడివిశేషు చెప్పారు. షానీల్ డియో విజన్ హాలీవుడ్ స్థాయిలో ఉంటుందని, దేశంలోని అరుదైన ప్రాంతాలు, గ్రామాలు, పట్టణాల నేపథ్యంలో సరికొత్త అనుభూతిని పంచేలా బరువైన పాత్రలతో స్టైలిష్ ఎంటర్‌టైనర్‌గా షానిల్ డియో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని అడివి శేషు అన్నారు. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది.


అమన్ సూరేపల్లి, సాయి సూరేపల్లి, అనిరుథ్ తుకుంట్ల

# కరీంనగర్స్ మోస్ట్ వాంటెడ్..

పొలిటికల్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న వెబ్‌సిరీస్ ‘కరీంనగర్స్–మోస్ట్ వాంటెడ్’ బాలాజీ భువనగిరి దర్శకత్వం వహించిన ఈ సిరీస్ డిసెంబర్ 22న ప్రముఖ ఓటీటీ వేదికపై ప్రసారం కానుంది. ఈ సిరీస్ ట్రైలర్, ‘కరీంనగర్ వాలే..’ అంటూ సాగే పాట ప్రస్తుతం బాగా వైరల్ అవుతున్నాయని మేకర్స్ సంతోషం వెలిబుచ్చారు. కరీంనగర్‌కి చెందిన నలుగురు కుర్రాళ్ల జీవితాలని ఆసక్తికరంగా పరిచయం చేస్తూ, కథను చూచాయగా తెలియజేస్తూ కట్‌చేసిన ట్రైలర్ యువతను కట్టిపడేస్తున్నవని మేకర్స్ చెప్పారు. ఇందులోని యాక్షన్ డ్రామా, కథలోని భావోద్వేగాలు మనసుకు హత్తుకుంటాయని, నూతన నటులు అమన్ సూరేపల్లి, సాయి సూరేపల్లి, అనిరుథ్ తుకుంట్ల సహజత్వంతో నటించారని, సాంకేతికంగా ఈ సిరీస్ అందరికీ నచ్చేలా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సిరీస్‌కి రచన: ‘బలగం’ఫేం రమేశ్ ఎలిగేటి, కెమెరా: సంకీర్త్ రాహుల్, సంగీతం: సాహిత్యసాగర్, నిర్మాణం: స్ట్రీట్ బీట్జ్ సినిమా.


సునీత, తనికెళ్లభరణి, శేఖర్‌కమ్ముల, భావన, కె.రాఘవేంద్రరావు, ఆకాశ్, అనిల్ రావిపూడి, గంగమోని శేఖర్

# భావోద్వేగాలతోకూడిన సర్కారు నౌకరి

‘నేను పరిచయం చేసిన వెంకటేశ్, మహేశ్, తారక్ గొప్ప పొజిషన్‌లో ఉన్నారు. ఇప్పుడు ‘సర్కారు నౌకరి’తో గాయని సునీత కుమారుడు ఆకాశ్‌ని హీరోగా పరిచయం చేస్తున్నాను. తను కూడా పెద్ద హీరోగా నిలబడాలి.’ అంటూ ఆకాంక్షించారు ప్రఖ్యాత దర్శకుడు కె.రాఘవేంద్రరావు. ఆకాశ్, భావన జంటగా ఆయన నిర్మించిన చిత్రం ‘సర్కారు నౌకరి’. గంగనమోని శేఖర్ దర్శకుడు. జనవరి 1న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో రాఘవేంద్రరావు మాట్లాడారు. ‘దర్శకుడు శేఖర్ తీసిన ‘పంచతంత్ర కథలు’ నచ్చి పిలిచిమరీ అవకాశం ఇచ్చాను.‘సర్కారు నౌకరి’ నా తరహా సినిమా కాదు. ఇది భావోద్వేగాలతో కూడిన ప్రయాణం.’ అని కె.రాఘవేంద్రరావు చెప్పారు. ఈ సినిమాకు పనిచేసిన అందరికీ మంచి పేరు రావాలని గాయని సునీత ఆకాంక్షించారు. హీరోహీరోయిన్లు అద్భుతంగా నటించారని, సాంకేతికంగా అందరూ బాగా సహకరించారని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్‌తో పాటు శేఖర్ కమ్ముల, అనీల్ రావిపూడి, వి.ఎన్.ఆదిత్య, బి.వి.ఎస్.ఎన్.రవి తదితరులు కూడా మాట్లాడారు.


తాప్సీ

# ఇదో గొప్ప అచీవ్‌మెంట్..

‘ ‘డంకీ’ నా కెరీర్‌లోనే స్పెషల్ మూవీ. నేను ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న అదృష్టం. థియేటర్‌లో ఆడియన్స్‌తో కలిసి చూస్తాను’ అంటున్నది అందాలభామ తాప్సీ. రేపు ఆమె నటిస్తున్న ‘డంకీ’ విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడింది. ‘నేను రాజ్‌కుమార్ హిరాణీ సార్‌కి వీరాభిమానిని. ఆయనవి సినిమాలు కావు. జీవితాలు. చేసిన సినిమాలన్నీ అద్భుతాలే. అందుకే ఆయనతో పనిచేయడం అంటే ఇష్టం. ఈ సినిమాతో ఆ కోరిక తీరింది. ఇందులో నాది మంచి పాత్ర. హైలీ ఎమోషన్స్‌తో కూడిన పాత్ర. ఈ సినిమాలో పాత్రలు పడే అంతర్మథనం తెరపై చూస్తేనే తెలుస్తుంది. రాజ్‌కుమార్ సార్ సినిమాలు సందేశాత్మకంగా, సబ్జెక్ట్ ఓరియెంటెడ్‌గా సాగినా వసూళ్ల పరంగా రికార్డులు తిరగరాస్తాయి. గతంలో వచ్చిన సినిమాలే అందుకే నిదర్శనం. ఈ సినిమాకు కూడా కచ్చితంగా కమర్షియల్‌గా కూడా సెన్సేషన్ సృష్టించడం ఖాయం. ఇందులో షారుఖ్. విక్కీ కౌశల్, బొమ్మన్‌సార్ ఇలా అందరూ గొప్పనటులే. గొప్ప దర్శకుడు చేసిన సినిమాలో గొప్ప నటులతో కలిసి పనిచేయడం ఓ గొప్ప అచీవ్‌మెంట్ నాకు. ఆ భూమిపై నేను లేనప్పుడు.. నటిగా నా గురించి ప్రస్తావన వస్తే ‘డంకీ’లోని నా పాత్ర గురించే చెప్పుకుంటారు.’ అంటూ ఆనందం వెలిబుచ్చింది తాప్సీ.